## ముథోల్ నియోజకవర్గంలో 80.34 శాతం పోలింగ్

ముథోల్, డిసెంబర్, 1 : ముథోల్ నియోజకవర్గ అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 80.34 శాతం పోలింగ్ నమోదైంది. ఇందులో మొత్తం 2,49,554 మంది ఓటర్లు ఉండగా 2,00,486 ఓట్లు నమోదైనట్లు అధికారులు తెలిపారు. దీంట్లో పురుషులు 1,21,744, మహిళలు 1,27,792, ఇతరులు 18 ఉన్నట్లు వివరించారు. ఇందులో పోలింగ్ అయినవి పురుషులు 97,761, మహిళలు 1,05,525 నమోదైనట్లు తెలిపారు. ఇందులో ముథోల్ మండలంలో మొత్తం 23,281, కుభీర్‌లో 32,477, కుంటాలలో 15,644, నర్సాపూర్‌లో 7,318, భైంసాలో 55,115, లోకేశ్వరంలో 24,145, బాసరలో 12,879, తానూర్‌లో 27,247 పోలింగ్ అయినట్లు అధికారులు వివరించారు. వీటిని ఈ నెల 3 న కౌంటింగ్ నిర్వహిస్తామని వెల్లడించారు.

## అవగాహన ర్యాలీ



మాట్లాడుతున్న హెల్త్ సూపర్‌వైజర్ ఖలీం

భైంసా, డిసెంబర్ 1 : ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా భైంసా పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో అవగాహన ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్ వైజర్ ఖలీం మాట్లాడుతూ.. ఎయిడ్స్ నిర్మూలనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఫిర్దోస్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

ఇచ్చోడ, డిసెంబర్ 1 : సిరికొండ మండలం సుంకిడి గ్రామానికి చెందిన సిడాం మహాదు కుమారుడు ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను శుక్రవారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యురాలు కుస్రం నీలాదేవి పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట మాజీ ఉపసర్పంచ్ ఆత్రం జల్పత్, రఘురాం, లక్ష్మణ్‌రావ్, నాయకులు ఉన్నారు.

## అవగాహనతోనే ఎయిడ్స్ నియంత్రణ

బోథ్, డిసెంబర్ 1 : ప్రపంచ ఎయిడ్స్ నిర్మూలన దినోత్సవం సందర్భంగా బోథ్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో శుక్రవారం విద్యార్థినులకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తి విధానం, జాగ్రత్తల గురించి ఉపాధ్యాయులు వివరించారు. ఎయిడ్స్‌కు మందు లేదని నివారణ ఒక్కటే మార్గమని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వర్ణలత, వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### బాధితులకు సానుభూతి అవసరం..

ఇచ్చోడ, డిసెంబర్ 1 : ఎయిడ్స్ బాధితులకు మందు కంటే సమాజ సానుభూతి, తోడ్పాటు అవసరమని డాక్టర్ సాగర్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఎయిడ్స్ నియంత్రణపై ఏఎన్ఎంలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ కిరణ్‌కుమార్, సీహెచ్‌వో బ్రహ్మానందరెడ్డి, పీహెచ్ఎన్ రాజుబాయి, హెచ్ఎస్ ఉత్తమ్ సింగ్, హెచ్ఎస్ రాథోడ్ కైలాస్, సుభాష్, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

### భీంపూర్‌లో ర్యాలీ..

భీంపూర్, డిసెంబర్ 1 : భీంపూర్ పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది శుక్రవారం ప్రపంచ ఎయిడ్స్ నిర్మూలన దినోత్సవం సందర్భంగా ర్యాలీ తీశారు. ప్రజలకు ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కల్పించారు. కరంజి(టీ), ధనోరా ఉపకేంద్రాల్లో కూడా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి నిఖిల్‌రాజ్, హెచ్ఈవో లింగంపల్లి జ్ఞానేశ్వర్, సూపర్‌వైజర్ బింగి గంగాధర్, సిబ్బంది పూర్ణిమ, ప్రవీణ, సుజాత పాల్గొన్నారు.

# ఆరుతడి.. ఆశాజనకం..

- ఆరుతడి పంటలతో లాభదాయకం
- యాసంగిలో అధికంగా సాగు..
- కుభీర్ మండలంలో 8,600 ఎకరాల్లో మక్క.., 8,400 ఎకరాల్లో శనగ..
- యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

రైతాంగం 'ప్రత్యామ్నాయ సాగు'పై దృష్టి పెట్టింది. ఏటా ఒకేరకమైన పంటలు వేయడం వల్ల భూములు సారవంతం కోల్పోయి రైతులు నష్టపోయే ప్రమాదముండగా, మార్పిడిని ప్రోత్సహిస్తున్నది. రాష్ట్రంలో ప్రధానంగా వడ్లకు బదులు.. శనగ, గోధుమ, పొద్దు తిరుగుడు, ఆముదం, పెసర, మినుము, కుసుమ, ఆవాలు, పల్లి, జొన్నలు, ఉలువలు సాగుచేస్తూ లాభాలు గడిస్తున్నది. కాగా, కుభీర్ మండలంలో ఈ యాసంగిలో శనగ, మక్క పెద్ద మొత్తంగా సాగుచేస్తున్నది. - కుభీర్, డిసెంబర్ 1



యాసంగిలో సాగు చేసిన మొక్కజొన్న

కుభీర్ మండలంలో యాసంగి సీజన్‌లో రైతులు ఆరుతడి పంటలైన శనగ, మక్క పంటలు సాగు చేస్తున్నారు. యాజమాన్య పద్ధతులత అధిక దిగుబడులు సాధిస్తున్నారు. కాగా, ఈ సీజనల్ అధికంగా 8,600 ఎకరాల్లో మక్క, 8,400 ఎకరాల్లో శనగ పండిస్తున్నారు. రాష్ట్రంలో యాసంగిలో సాగు చేసుకునే వివిధ ఆరుతడి పంటల్లో మక్క మంచి లాభదాయకమైన పంట. మామూలుగా మక్క అక్టోబర్ 15 నుంచి నవంబర్ 15 వరకు విత్తుకోవచ్చు. సోయా, పత్తి కోతలు ఆలస్యమైనప్పుడు నవంబర్ చివరి వారం నుంచి డిసెంబర్ 15 వరకు సాగు చేసుకోవచ్చు. ఈ పరిస్థితిలో 10 నుంచి 20 శాతం దిగుబడులు తగ్గే అవకాశం ఉంటుందని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

### యాజమాన్య పద్ధతులు..

స్వల్ప, మధ్య కాలిక రకాల విత్తనాలను ఎకరానికి 8 కిలోల చొప్పున అవసరరమవుతాయని ఏవో వికార్ అహ్మద్ చెప్పున్నారు. విత్తనాన్ని ఎకరానికి వరుసల మధ్య 60 సెంటీమీటర్లు, అలాగే మొక్కల మధ్య 20 సెంటీమీటర్ల వ్యత్యాసం ఉండేలా చూసుకోవాలని సూచిస్తున్నారు. మధ్యకాలిక రకాలైతే వంద నుంచి 110 రోజులు, స్వల్ప కాలిక రకాలైతే 90 నుంచి95 రోజుల వ్యవధిలో కోతకు వస్తుందని వివరిస్తున్నారు. ప్రభుత్వ, గుర్తింపు పొందిన కంపెనీలు, ప్రైవేటు రంగ సంస్థల విత్తనాలు ఎన్నుకొని సాగు చేసుకోవాలని సూచిస్తున్నారు. సాగు కంటే ముందు దుక్కిలో ఎకరానికి 20 నుంచి 25 కిలోలు జింకు సల్ఫేట్ వేసి, కలియ దున్నుకోవాలని తెలిపారు. పంట వేసిన తర్వాత జింక్ లోపం కనిపిస్తే మొక్కల పైన 2 గ్రాముల జింకు సల్ఫేట్ పిచికారి చేసుకోవాలి. యాసంగిలో పంట విత్తేముందు 75 కిలోల డీఏపీ, 250 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్‌ని వేసుకోవాలి. నెల రోజుల తర్వాత 50 కిలోల యూరియా, పంట పూత దశలో 50 కిలోల యూరియా, గింజ కట్టే దశలో 25 కిలోల యూరియా, పొటాష్ 25 కిలోలు వేసుకుంటే మంచి దిగుబడులు సాధించవచ్చని వివరిస్తున్నారు. కలుపు నివారణ ముఖ్యమైనది. ఎరువులు అధికంగా వాడుతాం కాబట్టి విత్తిన 48 గంటల్లో అట్రాజిన్ అనే కలుపు మందు ఎకరాకి 200 లీటర్ల నీటిలో కలుపుకొని పిచికారీ చేసుకోవాలి సూచిస్తున్నారు. కత్తెర పురుగును నివారించేందుకు లీటరు నీటిలో కోరాజిన్ 0.4మి.లీ కలుపుకొని మొక్కల మధ్య కాండం సుడులు బాగా తడిసేలా పిచికారీ చేసుకోవాలని తెలిపుతున్నారు. ఎండు తెగులు నివారణకు ట్రైకోడెర్మా విరిడి జీవన నాశిని అనే మందుతో వరుసల మధ్య పశువుల ఎరువుతో పాటు వాడుకుంటే నివారించుకోవచ్చని తెలిపారు. యాజమాన్య పద్ధతులు పాటించి, మంచి దిగుబడులు సాధించాలని ఆయన సూచించారు.

### ఎకరంలో వరి వేస్తే..

వరి సాగు చేస్తే నీటి వినియోగం, విద్యుత్ వాడకం ఎక్కువ. తెగుళ్ల బెడద సైతం ఉంటుంది. ఎకరాకు రూ.15 వేల వరకు పెట్టుబడి అవుతుంది. అన్నీ అనుకూలిస్తే సగటున 23 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. మద్దతు ధర క్వింటాలుకు ఏ గ్రేడ్ రకానికి రూ.1960 ఉంది. ఈ లెక్కన రూ.45,080 వస్తుంది. పెట్టుబడిపోను రూ. 30,080 మిగులుతాయి.

### ఎకరంలో శనగ సాగుతో..

నల్లరేగడి, తేమ నేలల్లో ఈ పంట వేసుకోవచ్చు. నీటి అవసరం ఉండదు. చలి ఎక్కువగా ఉండడం వల్ల సాగుకు అనుకూలంగా ఉంటుంది. 110 రోజుల్లో పంట చేతికి వస్తుంది. ఎకరాకు రూ.10 వేల వరకు పెట్టుబడి అవుతుంది. 10 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. ఈ ఏడాది యాసంగిలో మద్దతు ధర రూ.5,230 ఉంది. ఈ లెక్కన రూ. 52,300 వస్తుంది. పెట్టుబడిపోను ఎకరాకు రూ.42, 300 మిగులుతాయి. వరి సాగు చేసే రైతుకంటే.. శనగ వేసిన రైతుకు ఎకరాకు రూ.12,220 ఆదాయం అధికంగా ఉంటుంది.

### ఐదారేండ్లుగా మక్కసాగు చేస్తున్న..



*నేను ఐదారేండ్లుగా యాసంగిలో 6 ఎకరాల్లో మక్క సాగు చేస్తున్నా. యాజమాన్య పద్ధతులు పాటిస్తూ ఎకరాకు 40 నుంచి 45 క్వింటాళ్ల దిగుబడులు సాధిస్తున్నా. బరువైన పంట కావడంతో పాటు మార్కెట్లో ధరలు కూడా మంచిగా ఉంటున్నాయి. దీంతో ఖరీఫ్ పంటల కంటే యాసంగిలో సాగు చేస్తున్న మక్క పంటతో మంచి లాభాలు వస్తున్నాయి.* - సాయి ప్రసాద్‌రెడ్డి, మాలేగాంవ్, కుభీర్

## ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కల్పించాలి

ఎదులాపురం, డిసెంబర్ 1: వైద్య విద్యార్థులు క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ప్రజలకు ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కల్పించాలని రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్ సూచించారు. ప్రపంచ ఎయిడ్స్ నియంత్రణ దినోత్సవం సందర్భంగా రిమ్స్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరై,మాట్లాడారు. ప్రజలకు ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న ఫలితంగా వ్యాధి గ్రస్తులు సంఖ్య తగ్గుతుందన్నారు. వైద్య సేవల్లో భాగంగా వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి సరైన వైద్యం అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో భాగంగా వివిధ పోటీల్లో ప్రతిభ కనబర్చిన వైద్య విద్యార్థులకు ఆయన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రిమ్స్ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వంజరి, నోడల్ ఆఫీసర్ డాక్టర్ సరోజ, డాక్టర్ విద్యా విల్సన్, వైద్యులు విజయలక్ష్మి, రవిశంకర్, పద్మిని, సిబ్బంది రవి, తదితరులు పాల్గొన్నారు.



వైద్య విద్యార్థిని శ్రీనిధికి బహుమతి అందజేస్తున్న రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్

## జిల్లా స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ఇచ్చోడ, డిసెంబర్ 1 : ప్రపంచ ఎయిడ్స్ నిర్మూలన దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన క్విజ్ పోటీలో ఇచ్చోడ గిరిజన గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు ప్రథమ బహుమతి గెలుచుకున్నారు. క్విజ్ పోటీల్లో జీ కిరణ్ పదో తరగతి, ఎ సాయికుమార్ పదో తరగతి, పోస్టర్ పెయింటింగ్ కే సిద్ధార్థ బైపీసీ మొదటి సంవత్సరం(ప్రథమ), డ్రాయింగ్ పోటీలో ఆర్ సాయికుమార్ (ప్రథమ) బహుమతి డీఎంహెచ్‌వో చేతుల మీదుగా అందుకున్నారు. విజేతలను ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, వైస్‌ప్రిన్సిపాల్ హరిరాం, నర్మదా, ఎయిడ్స్ ఇన్‌చార్జి (రిమ్స్) సరిత అభినందించారు.



నార్నూర్: ఆసిఫాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మితో నాయకులు

## ఎమ్మెల్యే అభ్యర్థిని కలిసిన నాయకులు

నార్నూర్, డిసెంబర్ 1 : నార్నూర్ మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ఆసిఫాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మిని శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. గెలుపుపై ధీమా వ్యక్తం చేశారు. పోలింగ్ గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ గజానంద్‌నాయక్, భీంపూర్ ఎంపీటీసీ జాదవ్ రేణుక-దిలీప్, మండలాధ్యక్షుడు మెస్రం హన్మంత్‌రావ్, జాదవ్ ప్రకాశ్, ఉత్తమ్, ఫిరోజ్‌ఖాన్, షేక్ దాదేఅలీ, కుమ్ర రాహుల్, బషీర్, మహ్మద్‌ఖురేషి పాల్గొన్నారు.